ప్రజాశక్తి

గురువారం 11 ఏప్రిల్ 2024

I

అల్లూరి సీతారామరాజు



అసత్య ప్రచారాలు మానుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు వైస్ సర్పంచ్ మజ్జి మత్స్యరాజు సీపీఎం సభ్యుడు కాదనీ ఈ విషయాన్ని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం తెలుసుకోవాలని అబద్ధాలు, అసత్య ప్రచారాలు మానుకోవాలని హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు హితవుపలికారు. గన్నేరుపుట్టు మాజీ సర్పంచ్ సూడిపల్లి లక్ష్మీ ప్రమీల, పీసా అధ్యక్షుడు మజ్జి రాము, వార్డు మెంబర్ మజ్జి రాజా నాయుడు, యూత్ కమ్యూనిస్ట్ మజ్జి చిట్టిబాబులతో కలిసి వైస్ ఎంపీపీ కొండలరావు మీడియా సమావేశంలో మాట్లాడారు. వైస్ సర్పంచ్ ఏ నాడు సీపీఎం పోరాటాల్లో, ఉద్యమాల్లో పాల్గొలేదని తెలిపారు. గతంలో ఆయన టీడీపీలో కొంతకాలం తిరిగారని, అక్కడ సక్రమంగా ఉందలేదని, ఏ పార్టీ నాయకులు వస్తే..ఆ పార్టీ యే తనదనే రకమన్నారు.గన్నేరుపుట్టు పంచాయతీ లో సీపీఎం పార్టీకి ప్రత్యేక క్యాడర్ ఉందని వైస్ ఎంపీపీ తెలిపారు. ప్రజల కోసం పని చేయడం తెలియని జడ్పీటీసీ రేగం మత్స్యలింగం ఓటమి భయంతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు.గన్నేరుపుట్టు పంచాయతీ అభివృద్ధి సీపీఎంతోనే జరిందన్నారు.

గిరిజనులకు 'చింత'

చింతపండును కొనుగోలు చేయని జిసిసి
దళారుల వద్ద మోసపోతున్న గిరిజనులు



చింతపండు ను ఆటోలో తరలిస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజనులు పండించి సేకరిం చిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి గిరిజనులకు ఆర్థికంగా ఆసరా కల్పించడానికి ప్రభుత్వం జిసిసిని ఏర్పాటు చేసింది. అయితే జిసిసి చింతపండును కొనుగోలు చేయక పోవడంతో వారపు సంతల్లో దళారులు చొరబడి తక్కువ రేట్లకు అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో పాటు తూకంలో కూడా మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో, గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

మండలంలో ప్రస్తుతం చింతపండు కాపు కాయడంతో గిరిజనులు చింతపండును సేకరించి విక్రయాలు చేస్తున్నారు. జిసిసి చింతపండును కొనుగోలు చేయక పోవడంతో గిరిజనులు వారపు సంతలకు తరలించి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం జిసిసి ద్వారా ప్రకటించిన ధరలకన్నా తక్కువ ధరతో దళారులు వ్యాపారస్తులు కొనుగోలు చేయడంతో పాటు తూకాల్లో కూడా మోసలు చేస్తుండడంతో గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం జిసిసి నుంచి చింతపండు కిలో రూ .38 లు ధర ప్రకటించింది. కానీ సంతల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. మండలంలోని బుధవారం జరిగిన కించుమండ వారపు సంతలో జిసిసి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడంతో మైదాన ప్రాంతం నుంచి వచ్చిన వ్యాపారస్తులు, దళారులు కిలో రూ.30లకు కొనుగోలు చేసి ప్రైవేట్ వాహనాల్లో మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారు.



చింతపండు

గిరిజనులు ఎంతో కష్టపడి సేకరించిన చింతపండుకు కనీస ధర గిట్టుబాటు కాక పోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. జిసిసి అధికారులు దళారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయక పోవడంతో దళారులు, మైదాన ప్రాంత వ్యాపారస్తులు సంతల్లో చింతపండును కొనుగోలు చేసి లాభాలకు అమ్ముకుంటున్నారు. తక్షణమే జిసిసి అధికారులు స్పందించి చింతపండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని గిరిజనులు, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

జిసిసి కోనుగోలు చేయాలి

గిరిజనులు సేకరించిన చింతపండుకు కనీస మద్దతు ధర కిలో రూ.50 లకు కొనుగోలు చేయాలి. జిసిసి కొనుగోలు చేయక పోవడంతో గిరిజనులు చింతపండును దళారులకు తక్కువ ధరతో విక్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. జిసిసి సకాలంలో చింతపండును కొనుగోలు చేయకపోవడంతో మైదాన ప్రాంత వ్యాపారస్తులు, దళారులు వారి ఇష్టం వచ్చిన ధరలతో కొనుగోలు చేస్తున్నారు. జిసిసి చింతపండును కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.



టి.సూర్యనారాయణ
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు



మాట్లాడుతున్న నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

ఇవిఎంలు, వివి ప్యాడ్లపై శిక్షణ

రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం ఆర్ఓ ప్రశాంత్ కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు, వివి ప్యాడ్లపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సబ్ కలెక్టర్, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రంపచోడవరం అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లతో జరిగిన సమావేశంలో ప్రశాంత్‌కుమార్ మాట్లాడారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 59 మంది సెక్టార్ అధికారులు, 73మంది రూట్ అధికారులను నియమించినట్లు చెప్పారు. 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మొత్తం 702 మంది పిఒలకు, ఏపీవోలకు ఇక్కడ శిక్షణ తీసుకున్న అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈనెల 12వ తేదీన రంపచోడవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు, 13న గంగవరం, దేవీపట్నం, అడ్డతీగల మండలాలకు రంపచోడవరం లెనోరా ఇంజనీరింగ్ కాలేజీలోనూ, 15న చింతూరు, విఆర్ పురం, కూనవరం, ఏటపాక మండలాలకు చింతూరులోని గిరిజన సంక్షేమ బాలురు పాఠశాలలో ఈవీఎంలు, వివి పేడ్లపై ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. పిఒలు, ఏపీవోలు ఎన్నికల సరళిపై హ్యాండ్ బుక్ పక్కాగా పాటించాలని, ఎన్నికలు జరుగు సమయంలో గంట గంటకు సంబంధిత అధికారులకు పోలింగ్ శాతం తెలియజేయాలని సూచించారు. ఎక్కడైనా ఎన్నికల సమయంలో ఈవీఎంలు, వివి ప్యాడ్లు మొరాయిస్తే వెంటనే సంబంధిత రూట్ అధికారులకు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు జి.వీరభద్రరావు, ఎ.సత్యనారాయణ, చైతన్య, విశ్వనాథం, శివ, శ్రీధర్, సుబ్బారావు, స్వామి, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ఓటు వేసేందుకు విభిన్న ప్రతిభావంతులకు తగిన ఏర్పాట్లు

ఇవిఎంలపై శిక్షణను వినియోగించుకోవాలి ▸▸ జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు: సార్వత్రిక ఎన్నికలలో విభిన్న ప్రతిభావంతులు సులభంగా ఓటు వేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత స్పష్టం చేసారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతులు ఓటు వేయడానికి వీలుగా ఉండే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల నిర్మాణం చేయడం జరిగిందన్నారు. ఓటు హక్కు కలిగిన వికలాంగులను ముందుగా గుర్తించి నివేదిస్తే సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వీల్ చైర్లను సమకూరుస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీరు ఓటు వేయడానికి సహాయకులను అనుమతిస్తామని చెప్పారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందని వికలాంగ సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డి.ఆర్ ఓ పద్మావతి, రహదారులు భ వనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

పాడేరు: ఈవిఎంల నిర్వహణపై అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని విజయవంతంగా పోలింగ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత సూచించారు. స్థానిక ఎపి గురుకుల కళాశాలలో పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం జి.మాడుగుల మండలం, అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజక వర్గం పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల ప్రిసైడింగ్ అధికారులకు బుధవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలింగ్ రోజు ముందు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి తీసుకోవాలసిన ఎన్నికల సామగ్రి సక్రమంగా తీసుకోవాలన్నారు. పోలింగ్ యంత్రాల నిర్వహణను సమర్ధ వంతంగా పూర్తి చేయాలని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా స్ట్రాంగ్రూంకు అప్పగించాలని సూచించారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ మాట్లాడుతూ కంట్రోల్ యూనిట్, వివిపాట్, బ్యాలెట్ యూనిట్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల వద్ద కట్టు దిట్టమైన తనిఖీలు

ఎన్నికల కమేండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన వివిధ ఎన్నికల విభాగాలను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదు చేయాల్సిందేనని స్పష్టం చేసారు. చెక్ పోస్టుల వద్ద కట్టు దిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.పద్మావతి, మీడియా మోనిటరింగ్ నోడల్ అధికారి పి.గోవింద రాజులు, సోషల్ మీడియా నోడల్ అధికారి పి. రాములు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకోవాలి

పాడేరు: అత్యవసర సర్వీసు ఓటర్లు పోస్టల్ బ్యాలట్లను సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో అత్యవసర సర్వీసులకు చెందిన శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలట్‌కు అర్హతగల సిబ్బంది శాఖాదిపతుల ద్వారా ఫారం 12డిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 13ఎ లో డిక్లరేషన్ పూర్తి చేసి గజెటెడ్ అధికారి సంతకం చేయించి, అతికించిన చిన్న కవర్ కలిపి 13సి అనే పెద్ద కవర్ లో పెట్టి సంబంధిత ఆర్ఓకు పంపించాలని సూచించారు. డిక్లరేషన్ పరిశీలించి తప్పులు లేకుండా ఆమోదించబడినప్పుడు మాత్రమె పోస్టల్ బ్యాలట్ ఓపెన్ చేయడం జరుగుతుందని వివరించారు. డిక్లరేషన్‌లో సంతకాలు లేకుంటే దానిని పరిగణనలోకి తీసుకోబ డదని తెలిపారు.

సారా బట్టీపై పోలీసుల దాడులు

50 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం, వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని గడుఓకుర్తి పంచాయితీ చీడిపాలెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న నాటు సారా బట్టీపై బుధవారం రాజవొమ్మంగి ఎస్ఐ ఎస్.వెంకయ్య ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. సారా బట్టీని, సారా తయారీకి ఉపయోగించే 50 లీటర్ల బెల్లం ఊటను, సామగ్రిని ధ్వంసం చేశారు. సారా బట్టీ నిర్వహిస్తున్న చీడిపాలెం గ్రామానికి చెందిన పొలిరెడ్డి రాజబాబును అరెస్టు చేసి, ఆయన వద్ద నుండి ఐదు లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. రాజబాబుపై కేసు నమోదు చేసి అడ్డతీగల కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 15 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెంకయ్య తెలిపారు. ఈ దాడుల్లో జడ్డంగి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

టిడిపి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తా

-మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు: ప్రజాసేవే తన కర్తవ్యమని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టిడిపి రెబల్ అభ్యర్థిగా తాను పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి వెల్లడించారు. ఐదు మండలాల కార్యకర్తలతో బుధవారం కుమ్మరిపుట్టు వద్ద తన స్వగృహంలో భవిష్యత్ కార్యాచరణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్యకర్తల అభిప్రాయాల మేరకు పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో రెబల్ అభ్యర్థిగా పోటీ చేయబోతున్నానని ప్రకటించారు. పాడేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా కష్టపడి పని చేశానని, వేరొక వ్యక్తికి టికెట్ కేటాయించారన్నారు. కార్యకర్తలంతా సైనికుల్లా పని చేసి రెబల్గా గెలిపించి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకి పాడేరు నియోజకవర్గం నుండి గిఫ్టుగా ఇద్దామని ఆమె కార్యకర్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు పి గోవిందరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గంగ పూజారి శివకుమార్, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు డప్పోడి వెంకటరమణ, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నయ్య పడాల్

బిజెపితో కార్మికులకు పెనుముప్పు

ప్రజాశక్తి-చింతపల్లి: కార్మిక పోరాటాలకు బలపరిచే పార్టీలకే ఎన్నికల్లో ఓటు వేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు.బుధవారం సిఐటియు కార్యాలయంలో కొయ్యూరు. జికే వీధి. చింతపల్లి ప్రాంతీయ సదస్సు సిఐటియు జీకేవీధి కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాల సవరణ చేసి ఉద్యోగ భద్రతకు పెనుముప్పు తెచ్చిందన్నారు.ప్రభుత్వ రంగాలను విచ్చిన్నం చేసిందన్నారు. కేంద్రంలో బిజెపి కూటమి ఎన్డీఏను గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు దాసమ్మ మాట్లాడుతూ,ప్రత్యక్ష ఉద్యమంలో పాల్గొంటున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించు కుందామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణకుమారి, కొండమ్మ, జ్యోతి, పద్మ పావని పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే ఏజెన్సీ అభివృద్ధి

ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-చింతూరు

ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావాలన్నా, అభివద్ధి కార్యక్రమాలు జరగాలన్నా చట్టసభల్లో గొంతెత్తి మాట్లాడే సిపిఎం అభ్యర్థులను అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. చింతూరు సిపిఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలీన మండలాల్లో పోలవరం ప్రాజెక్టు, ముంపు బాధితులకు పునరావాసం, ప్యాకేజీ అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఇసుక మాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, దళితులపై హత్యలు, బెదిరింపులు అధికమయ్యాయని పేర్కొన్నారు. తాగునీరు, సాగునీరు, రోడ్ల సమస్యలను పట్టించుకున్న నాథుడే లేడన్నారు. రాజధానుల పేరుతో వైసిపి ప్రభుత్వం తమ పార్టీ అనుయాయులకు ఇసుక కాంట్రాక్టులు ముట్టజెప్పి మాఫియా వ్యాపారాలకు తెర లేపిందని తెలిపారు. అణిచివేతలు, బెదిరింపులు అధికమయ్యాయన్నారు. ఆదివాసీ నిరుద్యోగులకు భరోసాగా ఉన్న జీవో నెంబర్ 3ను సుప్రీం కోర్టు రద్దు చేస్తే దానిని పునరుద్ధరణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.

మళ్లీ రెండు నెలల్లో ముంపు మండలాల్లో వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ ఎన్నికల్లో వైసీపీకి అధికారం కట్టబెడితే ఈ ప్రాంత ప్రజలను వరదల్లో ముంచటం ఖాయమని విమర్శించారు. 2022లో వచ్చిన భారీగా వరదలకు నష్టపోయిన ప్రజలు పోలవరం పునరావాసం, పరిహారంపై ముఖ్యమంత్రిని ప్రశ్నించగా, తన వద్ద ఏమీ లేదని, కేంద్ర ప్రభుత్వమే అన్ని విధాల ఆదుకోవాలని చేతులెత్తేశారని విమర్శించారు. ఇటువంటి చేతకాని పార్టీలకు ఓటు వేసి అధికార పీఠం ఎక్కిస్తే ఈసారి అందరినీ అధ:పాతాళానికి తొక్కి వేయడమే జరుగుతుందని పేర్కొన్నారు. సిపిఐ కాంగ్రెస్ పార్టీలు బలపరిచిన రంపచోడవరం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, మండల కార్యదర్శి సీసం సురేష్, జిల్లా నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, మట్టం రాజయ్య, మడకం చిన్నయ్య, కారం నాగేష్, మల్లం సుబ్బమ్మ, పెద్ద రాములు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే రోడ్డు నిర్మాణానికి కృషి

అరకు అసెంబ్లీ సిపిఎం అభ్యర్థి దీసరి గంగరాజు

ప్రజాశక్తి అరకులోయ రూరల్

అరకు ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే తారు రోడ్డు నిర్మాణం కోసం కృషి చేస్తానని అరకు అసెంబ్లీ సిపిఎం అభ్యర్థి దీసరి గంగరాజు తెలిపారు. బుధవారం అరకువేలి మండలం మాదల పంచాయతీ మారుమూల డోమలజోరు, రత్తకండి, దాబుగుడ, తోటవలస, రత్తగుడ, పొట్టంగిపాడు సరుబెడ్డ గ్రామాల్లో గంగరాజు పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మహిళలు సాంప్రదాయ బద్ధంగా తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, మోడల్ కోలనీ, సరుబెడ్డ, దాబుగుడలో సిసి రోడ్డు, తాగునీటి సౌకర్యం, . మజ్జివలస జంక్షన్ నుండి దాబుగుడ వరకు తారు రోడ్డు నిర్మించే విధంగా కృషి చేస్తానన్నారు. సిపిఎం అరకు ఎంపి, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, అనంతగిరి సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, అరకు వేలి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, కిల్లో నాయుడు, సిపిఎం నాయకులు కొర్ర అప్పన్న, కొర్ర గోపాల్, కుమిడి రమేష్, పి.రాము పాల్గొన్నారు.



గిరిజనులతో కలిసి నినాదాలు చేస్తున్న సిపిఎం అరకు అసెంబ్లీ అభ్యర్థి దీసరి గంగరాజు



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన జీడి మామిడి తోట

10 ఎకరాల్లో జీడి మామిడి తోటలు దగ్ధం

రూ.2లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని ముంజవరపాడు గ్రామంలో బుధవారం తెల్లవారు జరిగిన అగ్ని ప్రమాదంలో 10 ఎకరాల జీడి మామిడి తోటలు దగ్ధమై రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. ముంజవరపాడు గ్రామానికి చెందిన జంపా బుచ్చిరాజు అనే గిరిజనుడికి చెందిన సుమారు పది ఎకరాలు తోట దగ్ధమైంది. చేతికందొచ్చిన జీడి మామిడి పిక్కలు, పిందే, పూత కాలి బూడిదయ్యాయని గిరిజన రైతు బుచ్చిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సమీప అటవీ ప్రాంతంలో కారుచిచ్చు వలనే అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఈ అగ్ని ప్రమాదం వల్ల తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశారు.

జాతీయ రహదారిపై కల్వర్టు నిర్మాణం చేయాలని వినతి

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని ఏడుగురాళ్లపల్లి గ్రామంలోని గంగనమ్మ చెరువు పంట కాలువ నీరు పొలాలకు వెళ్లుందుకు వీలుగా జాతీయ రహదారి-30పై కల్వర్టు నిర్మాణం చెపట్టాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు సిపిఎం నాయకులు మల్లం సుబ్బమ్మ ఆధ్వర్యాన ఆ గ్రామస్తులు బుధవారం వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి-30 రోడ్డు నిర్మాణంలో ఏడుగురాళ్లపల్లి గ్రామ రైతులకు సాగునీరు అందిస్తున్న పంట కాలువను పూర్తిగా మూసి వేశారని తెలిపారు. దీంతో 200 ఎకరాలకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. ఈ ప్రాంతంలో వర్షాధారంతో సాగయ్యే వ్యవసాయానికి చెరువులు కాలువలు చాలా కీలకమని, అధికారులు ఈ విషయాన్ని గుర్తించి తక్షణమే జాతీయ రహదారిపై కల్వర్టు నిర్మాణం చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సవలం కన్నయ్య, సవలం దేశయ్య, ఎం రాజు పాల్గొన్నారు.



ఐటిడిఏ పిఓ కావూరి చైతన్యకు వినతిపత్రం ఇస్తున్న ఏడుగురాళ్లపల్లి గ్రామస్తులు

సిపిఎంతోనే గిరిజనుల హక్కులు, చట్టాలకు రక్షణ

పలు గ్రామాల్లో సిపిఎం నేతల ముమ్మర ప్రచారం



ముంచంగిపుట్టులో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ముంచంగిపుట్టు:మండలంలోని బుంగపుట్టు గ్రామ పంచాయతీ చట్టుగుంది గ్రామంలో బుధవారం సిపిఎం నేత, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ హక్కులు, చట్టాలు కాపాడేందుకు నిత్యం కృషి చేస్తున్న సిపిఎం అరకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జీవో 3 రద్దుతో సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనరస పిటిషన్ వేశారన్నారు. జిఒ 3 గిరిజన ప్రాంతంలో రద్దు కావడంతో నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కోల్పోయి గిరిజన యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. జిఒ 3 ను సాధించుకోవడానికి చట్టసభలలో ప్రశ్నించే ఏకైక గొంతుక సిపిఎం బలపరిచిన అభ్యర్థులేనని తెలిపారు. గిరిజన ప్రాంతంలో భూగర్భ ఖనిజ సంపదను దోచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టేందుకు కనీసం గ్రామసభలు నిర్వహించ లేదన్నారు. సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి గంగరాజు, ఎంపీ అభ్యర్థి అప్పలనరసను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్య కర్తలు చందర్, జెట్టు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుకుంపేట:మండలంలోని అండిభ పంచాయితీ బంగారుమెట్ట, నక్కగొయ్యి, అడవరాయి, కొత్తూరు గ్రామాల్లో మండల పరిషత్ వైస్ ఎంపీపీ, సిపిఎం నేత సూడిపల్లి కొండలరావు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరకు సీపీఎం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అప్పలనర్స, గంగరాజులను గెలిపిస్తే తారు రోడ్డు మంజూరు చేస్తారని తెలిపారు. ప్రజల పక్షం పోరాటం చేస్తున్న నాయకులను ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మామిడి చంటి బాబు, బాలన్న, చిన్నయ్య, భీమన్న, బాబూరావు, మత్స్యలింగం, బాలరాజు పాల్గొన్నారు.

పెదబయలు:మండలంలోని లక్ష్మీపేట పంచాయితీ కోడువలస, మండిబ, పుట్టూరు, బల్లరాయి, కిలుములు, గాడిపల్లి, గదురుపల్లి, లుంగతంగి, వడ్డేపుట్టు గ్రామాల్లో సిపిఎం నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు కొన్నెల్లు కె.శరబన్న మాట్లాడుతూ, జిఒ 3 రద్దు చేసే రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ కూడా దాఖలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జంపరంగి సునీల్ కుమార్, వంతల నరసయ్య పాల్గొన్నారు



హుకుంపేట మండలంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు



పెదబయలు మండలంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

'గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండల కేంద్రంలో గిరిజన చట్టాలను ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న గిరిజనేతరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తక్షణమే ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కమిటి నాయకులు, అల్లూరి జిల్లా ఎస్సి, ఎస్టీ కమిటి సభ్యుడు చెండా లోహిదాసు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల కేంద్రంలో వివిధ ప్రాంతాల నుండి వ్యాపార రీత్యా వచ్చిన కొంతమంది గిరిజనేతరులు చట్టాలను అతిక్రమించి దుకాణాలు నిర్మిస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో 1/70, పీసా చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ గుట్టు చప్పుడు కాకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఎల్టీఆర్ కేసులు బనాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ సభ్యులు అనిల్, రెయ్యాల నాగభూషణం, పాంగి భాస్కర్, కీముడు రాంబాబు పాల్గొన్నారు.

వలసలు అరికడతాం

సిపిఎం అరకు ఎమ్మెల్యే అభ్యర్థి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: ఏజెన్సీ నుంచి వలసలు అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటామని సిపిఎం అరకు ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పిటిసి దీసరి గంగరాజు తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని రొంపల్లి, ఎన్ఆర్ పురం, గుమ్మకోట, గరుగుబి తదితర గ్రామాల నుండి గుంటూరు, నెల్లూరు ఇతర జిల్లాలలకు అధిక మంది గిరిజన వలస కూలీలు వెళుతున్నారన్నారు. ఏడాదికి పదుల సంఖ్యలో గిరిజన వలస కూలీలు ఆయా ప్రాంతాల్లోని పనుల్లో ప్రమాదాలు, అనారోగ్యంతో మృత్యువాతకు గురవుతున్నారని తెలిపారు. వలసలు వెల్లకుండా అరికట్టాలంటే ఎన్ఆర్ఈజీఎస్ చట్టం కింద ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు.

మోదకొండమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి-పాడేరు

పాడేరు మోదకొండమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. మే 19, 20, 21 తేదీలలో మోదకొండమ్మ జాతరను ఘనంగా నిర్వహించాలని స్పష్టం చేసారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేసి జాతరను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి, రవాణా, విద్యుతు, వైద్య సేవలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. తాగునీటి సమస్య లేకుండా మంచి నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి అధికారులకు సూచించారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎనిమిది నుండి తొమ్మిది వందల మంది పోలీసులతో పోలీసు బంధోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా ముందుగా పార్కింగ్ ప్రదేశం నిర్దేశించుకుని భూమి చదును, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డి.ఆర్.ఓ, పద్మావతి, ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇ డి. వి.ఆర్.ఎం. రాజు, డి.డి. ఐ.కొండలరావు, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇఇ లీలా కుమార్, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం - మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్‌రోడ్డు తొట్లకొండ వద్ద మంగళవారం అర్థరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు.మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం..రుషికొండ నుంచి భీమిలి వైపు వస్తుండగా మార్గమధ్యలో తొట్లకొండ వద్ద స్నేహితుని మోటారు బైక్ ఆగిపోయిందని తెలుసుకున్న రుషికొండకు చెందిన దౌలపల్లి చిన అప్పలరాజు తన స్కూటీపై తొట్లకొండ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో మోటారు బైక్, స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన చిన అప్పలరాజు (25)ను కెజిహెచ్‌కు తరలించగా,మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో స్కూటీని ఢీకొట్టిన బైకిస్ట్ చింతపల్లి వీరభద్ర (27) తీవ్రగాయాలపాలై, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృత్యువాత పడ్డాడు. ఇదే ప్రమాదంలో బైక్ పై వెనుక కూర్చున్న దుర్గ, రాజు తీవ్ర గాయాలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రి గేట్ ఎదురుగా ఉన్న ఒటి ట్రైమ్ దుకాణం వెనుక సుమారు 55 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గడుల టీ షర్ట్, ట్రాక్ ధరించి ఉన్న వ్యక్తి మరణించాడు. మతి స్థిమితం లేని వ్యక్తి కావచ్చుని భావిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు భీమిలి పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్తింట్లో అల్లుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. సిఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివి. జివిఎంసి ఆరో వార్డు గాయత్రినగర్‌కు చెందిన మామిడి ఈశ్వరరావు తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న ఈశ్వరరావు, ఈనెల 8న రాత్రి సాంకేతిక కళాశాల సమీపంలోని తన అత్తవారింట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెల్లవారి బంధువులు చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతుని భార్య గౌరీ ఫిర్యాదు మేరకు, ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్యాపిల్లలు ఉన్నారు.

మనస్తాపంతో ఆత్మహత్య

ప్రజాశక్తి- ఆనందపురం: మండలంలోని ఆనందపురం హైస్కూల్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున పల్లా పైడిరాజు (55) అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హైస్కూల్ సమీపంలోని యాదవుల కాలనీలో నివాసముంటూ, ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్న పైడిరాజు మద్యానికి బానిసై, అనారోగ్యం పాలయ్యాడు. దీంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు అంటున్నారు. పైడిరాజుకు భార్య సింహాచలం, ఇద్దరు కుమారులు రామ లక్ష్మణ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు రామ లక్ష్మణ ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

గ్రూప్ 2 మెయిన్స్‌కు 43 మంది అర్హత

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ వెల్లడి

ప్రజాశక్తి పాడేరు : రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్- 2 ప్రిలిమ్స్‌లో 43 మంది గిరి పుత్రులు విజయం సాధించారని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐటిడిఏ ఆధ్వర్యంలో వేపగుంట వైటీసీలో సివిల్స్ శిక్షణ పొందుతున్న 60 మంది అభ్యర్థులలో 59 మంది అభ్యర్థులు ఇటీవల నిర్వహించిన గ్రూప్ 2 ప్రిలిమ్స్ కు హాజరయ్యారు. వీరిలో 43 మంది మెయిన్స్ కు అర్హత సాధించాలని పిఓ చెప్పారు. అర్హత సాధించిన అభ్యర్థులకు, శిక్షణ అందిస్తున్న 21వ సెంచరీ సంస్థ నిర్వాహకులు ధరణికు పివో అభినందనలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తి కొనసాగించి గ్రూప్ -2 మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఘనంగా నూకాంబిక మారు పూజోత్సవం



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు, ప్రజలు

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం సీలేరు జల విద్యుత్ కేంద్ర సమీపంలో వెలసిన నూకాంబిక అమ్మవారి మారుపూజోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా అమ్మవారికి పుష్పాలంకరణ కుంకుమార్చన, భక్తుల గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల ఆర్థిక సహాయంతో ఆలయ భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.


టిడిపి కూటమి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-రంపచోడవరం : టిడిపి, జనసేన, బిజెపి కూటమి అరకు పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీత, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి మిరియాల శిరీషా దేవి బుధవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. స్థానిక సీతపల్లి బాపనమ్మ తల్లి ఆలయంలో ఇరువురు అమ్మవారిని దర్శించుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుండి రంపచోడవరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గీత మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో ఎంతోమంది గిరిజనులు అణిచివేతకు గురయ్యారని, ఇక్కడ హత్యారాజకీయాలు చేస్తున్నారని, ఎవరైనా గొంతెత్తి ప్రశ్నిస్తే వారి గొంతు నొక్కడానికి చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, కాకి స్వామి, కుర్లా రాజశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

13న కూటమి అభ్యర్థుల రోడ్ షో

కూనవరం : టిడిపి కూటమి అభ్యర్థులు మిరియాల శిరీషాదేవి, కొత్తపల్లి గీత పర్యటన మండలంలో ఈ నెల 13న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు ఉంటుందని, ఈ సందర్భంగా నిర్వహించే రోడ్ షోలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ సోడే రామయ్య పిలుపునిచ్చారు. మండలంలోని టేకులబోరులో బుధవారం వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కూటమి నాయకులు, కార్యకర్తల సమావేశంలో రామయ్య మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయా పార్టీల నాయకులు బరపాటి ప్రకాష్ రావు, ఇంటి భాస్కరరావు, గడేసుల రంజిత్, నోముల సత్యనారాయణ, గడ్డిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం



11వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ: బడుగు బలహీన వర్గాలకు మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటోందని తూర్పు ఎమ్మెల్యే, ప్రస్తుత కూటమి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. బుధవారం 11వ వార్డు టిడిపి ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా .పాత ఆరిలోవ, వికలాంగుల కాలనీ, రాజీవ్‌నగర్, స్వామి వివేకానందనగర్, డ్రైవర్స్ కాలనీల్లో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు కార్యక్రమంలో టిడిపి నాయకులు ముగడ రాజారావు, రాగతి అచ్యుతరావు, మూది అప్పారావు, ఒమ్మి అప్పలరాజు, నమ్మి గణేష్, పేపర్ నాయుడు, ఒమ్మి అప్పలరాజు పాల్గొన్నారు.

సైబర్ మోసగాడి అరెస్టు

ఉద్యోగాల పేరుతో యువతకు నయవంచన

పలువురి నుంచి రూ.లక్షల్లో వసూలు

కేసు చేధించిన సిఐడి పోలీసులకు అభినందన



వివరాలు తెలియజేస్తున్న సిఐడి అధికారులు)

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆన్‌లైన్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకొని ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న నిరుద్యోగ యువతి, యువకులను మోసం చేసి, డబ్బులు వసూలు చేసిన ఒక సైబర్ మోసగాడిని సాంకేతిక పరిజ్ఞానంతో సిఐడి సైబర్ విభాగం ఎట్టకేలకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది. దీనికి సంబందించిన వివరాలను బుధవారం పైనాపిల్ కాలనీ సిఐడి ప్రాంతీయ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో సిఐడి అడిషనల్ ఎస్‌పి రవివర్మ ఆధ్వర్యంలో సిఐడి ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ వివరించారు.

విశాఖపట్నం జిల్లా పెందుర్తి, జుత్తాడ గ్రామానికి చెందిన గిన్ని గోపి, బిటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో మెషిన్ టెస్టింగ్ ఉద్యోగంలో చేరాడు. అక్కడ కొంతకాలం పనిచేసి మానేసాడు. తరువాత ఇంటర్నెట్‌లో లింక్డ్ఇన్ వెబ్‌సైట్‌లో జాబ్స్ కోసం దరఖాస్తు చేసుకునే వారి డిటైల్స్ తీసుకొని తన వాట్సాప్ ద్వారా కాంటాక్ట్ అయ్యి జాబ్ ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసేవాడు. ఈ విధంగా ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న నిరుద్యోగ యువతీ, యువకులే ధ్యేయంగా పెట్టుకొని వారి వద్ద నుంచి డబ్బులు వసూలుకు అలవాటు చేసుకున్నాడు. ఇదే విధంగా భీమిలిపట్నానికి చెందిన నిరుద్యోగ యువతిని ఆన్‌లైన్లో పరిచయం చేసుకొని ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి గూగుల్ మీట్ ద్వారా ఒక ఫేక్ ఇంటర్వ్యూ కండక్ట్ చేసి, ఫేక్ ఆఫర్ లెటర్ కూడా ఆమెకు పంపించాడు. ఆమె వద్ద నుంచి ఫోన్ పే ద్వారా దఫదఫాలుగా రూ 56,500 తన అకౌంట్‌కు వేయించుకున్నాడు. అదేవిధంగా నంద్యాల జిల్లాకు చెందిన ఒక నిరుద్యోగి యువతి నుంచి రూ 3.18 లక్షలు, తిరుపతికి చెందిన ఒక యువకుడు నుంచి రూ 30 వేలు, విశాఖకు చెందిన మణికంఠ వద్ద నుంచి రూ 34,750, మణికంఠ స్నేహితుడు సయ్యద్ అజీమ్ నుంచి రూ.23 వేలు వసూలు చేసాడు. ఇలా 17 మంది వద్ద నుంచి సుమారు రూ 8 .లక్షలు వసూలు చేసినట్టు గుర్తించారు. ఇదే తరహాలో తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల యువతి యువకుల నుంచి యుపిఐ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినట్టు గుర్తించారు. సైబర్ నేరాన్ని ఛేదించిన సిఐడి అడిషనల్ ఎస్‌పి రవి వర్మ, ఇన్‌స్పెక్టర్ వర ప్రసాద్, ఎస్ఐలు గోపాలరావు, సురేష్ బాబు, పిసిలు వెంకట రమణ, మహిళా పిసి ఎ.సరితలను సిఐడి అడిషనల్ డిజిపి సంజయ్ అభినందించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఐడి సైబర్ క్రైమ్ అనాలసిస్ అండ్ టాస్క్‌ఫోర్స్ టీం హెచ్చరించింది. నిరక్షరాస్యుల నుంచి పెద్ద హోదాల్లో ఉన్న వారు కూడా దీనిలో బాధితులుగా ఉన్నారన్నారు. ప్రజలు ఆన్‌లైన్ జాబ్ ఫ్రాడ్, ఆన్‌లైన్ ఇన్వెస్టిమెంట్, ఫేక్ ఆన్‌లైన్ లింక్ గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్లో వచ్చిన మోసపూరిత లింక్‌లను ఓపెన్ చేయవద్దని, అపరిచిత వ్యక్తుల మాయ మాటలు నమ్మి ఎటువటి డబ్బులు చెల్లించవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల్లో మోసపోతే తక్షణమే 1930 టోల్ ఫ్రీ సెంటర్‌కు లేదా www.cybercrime.gov.in అనే వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఫిర్యాదు చేయాలన్నారు. దీనితో పాటు అందుబాటులో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

కొలువుదీరిన కొత్త న్యాయవాదుల సంఘం

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : విశాఖపట్నం న్యాయవాదుల సంఘం నూతన కమిటీ బుధవారం కొలువు దీరింది. పాత కమిటీ నుంచి బాధ్యతలను స్వీకరించింది. నూతన కమిటీ అధ్యక్షులు బెవరా సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఇమంది శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి దంతా నరేష్‌కుమార్ సంయుక్త కార్యదర్శి అడపా సుధాకర్, కోశాధికారి సొప్పా అశోక్‌బాబు, ఇతర పాలకమండలి సభ్యులు బాధ్యతలను చేపట్టారు.

ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, అందరి సహకారం, సమన్వయంతో కృషి చేస్తానన్నారు.కొత్త కమిటీకి పూర్వ కమిటీ అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైల శ్రీనివాసరావు సీనియర్ న్యాయవాదులు ఇమంది కూర్మారావు, ఎస్ మోహన్‌నాయుడు బగాది తులసీదాస్, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్, సభ్యులు రామ జోగేశ్వరరావు, బైపా అరుణ్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి- సీతమ్మధార : కీటక జనిత వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి, అప్రమత్తతతో ఉండాలని డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక ప్రాంతీయ నేత్ర వైద్యాలయ సమావేశ మందిరంలో ఆరు జిల్లాల డిఎంఒలు, ఎఎంఒలు, సీనియర్ ఎంటమాలజిస్ట్, మలేరియా సబ్‌యూనిట్ అధికారులు, ఎంపిహెచ్ఇఒలకు శిక్షణనిచ్చారు. దోమలు, ఇతరత్రా కీటకాలతో వచ్చే డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధి లక్షణాలు వచ్చిన వెంటనే రోగుల రక్తనమూనాలను సేకరించి, వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, పాజిటివ్‌గా తేలితే ప్రభుత్వపరంగా ఉచిత మందులను అందజేయాలని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మనోధైర్యాన్ని కోల్పోవద్దు

ప్రజాశక్తి- సీతమ్మధార : పబ్లిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, లేకుంటే ఫెయిలయ్యామనే బాధతో విద్యార్థులు మనోధైర్యాన్ని కోల్పోయిన ఆత్మన్యూనతా భావంతో అనాలోచిత నిర్ణయాలకు పాల్పడవద్దనిరాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఈ నెల 12న ఇంటర్ పరీక్షా ఫలితాలు వెలవడనున్న నేపథ్యంలో విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులకు మార్కులు, ఉత్తీర్థత అంశాలే ముఖ్యం కాదని, విద్యార్థి దశలో ఇదొక చిన్నమెట్టు మాత్రమేనన్నారు. ప్రతి ఓటమిని గెలుపునకు తొలిమెట్టుగా భావించి, రెట్టించిన పట్టుదలతో కృషిచేసి అనుకున్నది సాధించాలని పిలుపునిచ్చారు. పరీక్ష ఫెయిలయ్యాననే బాధతో అఘాయిత్యాలకు పాల్పడి, తల్లిదండ్రులు, కుటుంబీకులు, స్నేహితులకు మానసిన వేదనకు గురిచేయవద్దని హితవు పలికారు.

ఇండియా ఫోరమ్‌కు పెన్షనర్ల మద్దతు

ప్రజాశక్తి -ములగాడ : ఇపిఎఫ్ పెన్షనర్లకు పెన్షన్ సొమ్ము పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి హామీనిచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా మోసగించాయని, ఆయా పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అప్రా సంఘ సమావేశంలో నిర్ణయించారు. బుధవారం మల్కాపురం సిఐటియు కార్యాలయంలో కె.నూకరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో .అప్రా జిల్లా ప్రధాన కార్యదర్శిఎస్ కె హుస్సేన్ మాట్లాడుతూ, గత నెల 19న జరిగిన ధర్నా జయప్రదం చేసిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. హయ్యర్ పెన్షన్ గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేదని, రానున్న ఎన్నికల్లో హామీలిచ్చి మోసగించిన ప్రభుత్వాలు ఓడిపోవడం ఖాయమని, ఇండియా ఫోరం అధికారంలోకి రావడం, తమ డిమాండ్లన్నీ పోరాడి సాధించుకుందామన్నారు. స్టీల్‌ప్లాంట్ నుంచి రూ.400కోట్లను ఇపిఎఫ్ హెడ్డాఫీస్‌కు జమచేసినా, పెన్షనర్లకు చెల్లింపులో సాంకేతిక కారణాలను చూపుతూ అలసత్వం చేస్తున్నారన్నారు . ఇపిఎఫ్ పెన్షనర్లకు కనీస పింఛనును రూ.నాలుగు వేలు నుంచి రూ.7500 వరకు ఫిబ్రవరి 29నాటికి ఖాతాల్లో జమ అవుతుందని బూటకపు హామీలు ఇచ్చి పెన్షనర్లను గందరగోళానికి గురి చేస్తున్నారని, వారి మాటలను నమ్మొద్దని సూచించారు. కేవలం డబ్బు వసూలు కోసమే ఇలాంటి దొంగనాటకాలను కొందరు ఆడుతున్నారరన్నారు. సీనియర్ సిటిజన్ల రైల్వే ఛార్జి రాయితీని రద్దు చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఎలా నమ్మేదని ప్రశ్నించారు. గడచిన పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పైసా పెన్షన్ పెంచలేదని, మోడీ అధికారంలో ఉన్నంత వరకు పెన్షన్ పెరిగే అవకాశాలూ లేవన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా ఫోరమ్‌కు మద్దతు ఇచ్చి, గెలిపించే బాధ్యత పెన్షనర్లపై ఉందన్నారు.

అబ్బరపరిచిన బొప్పాయి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర గ్రామంలో గిరిజన రైతు ఈక రామన్నదొర పెరట్లో పెరిగిన సుమారు 8 కిలోల బొప్పాయి పండు చూపరులను అబ్బర పరుస్తుంది. రామన్నదొర తన పెరట్లో సుమారు సంవత్సరం కాలం ఉన్న బొప్పాయి చెట్టుకు ఈ అతి పెద్ద బొప్పాయి పండు కాయడంతో చుట్టుపక్కల వాళ్ళ బొప్పాయి పండుని చూసి ఇంత పెద్ద బొప్పాయిని ఎప్పుడూ చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



బొప్పాయి చూపిస్తున్న రైతు రామన్న

టోఫెల్ ప్రైమరీ సంసిద్ధత పరీక్ష



టోఫెల్ ప్రైమరీ సంసిద్ధత పరీక్ష పర్యవేక్షిస్తున్న డైట్ ప్రిన్సిపల్ జ్యోతీకుమారి

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో బుధవారం ప్రాథమిక తరగతి విద్యార్థులకు ఒఎంఆర్ ద్వారా టోఫెల్ ప్రైమరీ సంసిద్ధత పరీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించి ఆడియో ఫైల్స్‌ను పాఠశాలల్లోని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టివిల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు జిల్లా టోఫెల్ మోడల్ అధికారి, స్థానిక ప్రభుత్వ డైట్ సీనియర్ అధ్యాపకులు జిజిఎస్ నాగేశ్వరరావు, ఎంఇఒ ఎం శివరా స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి టోఫెల్ పరీక్ష నిర్వహణను పరిశీలించారు. నాల్గో వార్డు జె వి అగ్రహారం, చిన ఉప్పాడ, ఒకటో వార్డు సంతపేట డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రాథమిక పాఠశాల, బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ల్లో పరీక్ష నిర్వహణను డైట్ అధ్యాపకులు ఎల్ సుధాకర్, సోమయాజులు, త్రినాథరావుపరిశీలించారు. స్కానర్ ద్వారా వాల్యుయేషన్ జరుగుతుందని డైట్ ప్రిన్సిపల్ ఎం జ్యోతి కుమారి తెలిపారు